
క్లుప్తంగా

రావి ఆకుపై బాబూజీ మహరాజ్ చిత్రం



తోటపల్లిగూడూరు: మండలంలోని నారికేళపల్లి పంచాయతీ సుబ్బారెడ్డిపాళెం యూపీ స్కూల్ తెలుగు పండిట్ సోమా పద్మారత్నం మంగళవారం రావి ఆకుపై వాటర్ కలర్స్‌తో ఆధ్యాత్మిక గురువు బాబూజీ మహరాజ్ చిత్రాన్ని ఆవిష్కరించారు. బుధవారం ఆధ్యాత్మిక ధ్యానానికి ఆద్యుడైన బాబూజీ 126వ జయంతి సందర్భంగా ఈ చిత్రాన్ని ఆవిష్కరించి అంజలి ఘటించారు.

రైతులకు అవగాహన



మాట్లాడుతున్న ఏఓ

విడవలూరు: మండలంలోని చౌకచర్ల రైతు సేవా కేంద్రంలో మంగళవారం మట్టి పరీక్షలతో కలిగే ఉపయోగాలపై వ్యవసాయాధికారి పి.వెంకటకృష్ణయ్య అవగాహన కల్పించారు. అనంతరం పొలాల్లో మట్టిని ఎలా సేకరించాలో చూపించారు.

వైభవంగా జాతర



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

ఇందుకూరుపేట: మండలంలోని కొమరిక గ్రామంలో ఉన్న మొలక పోలేరమ్మ జాతర మంగళవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. భక్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకొన్నారు. రాత్రి మొలక పోలేరమ్మ, గంగమ్మల గ్రామోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. దీంతో గ్రామంలో కోలాహలం నెలకొంది.

అట్రాసిటీ కేసు నమోదు

వెంకటాచలం: మండలంలోని నాయుడుపాళెం గ్రామానికి చెందిన సీహెచ్ హరిబాబు, కృష్ణయ్యపై పోలీసులు మంగళవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. అకారణంగా కులం పేరుతో దూషించి, దాడి చేశారని గ్రామానికి చెందిన అనిత అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులను కాపాడుకుందాం


వెంకటాచలం: భవిష్యత్ అవసరాల దృష్ట్యా చెరువులను కాపాడుకునేందుకు ప్రజల సహకారం అందించాలని ఫారెస్ట్ అధికారులు సూచించారు. మండలంలోని కసుపూరులో మంగళవారం అటవీశాఖాధికారులు పర్యటించారు. కసుపూరు చెరువులో వ్యర్థాలు పడేయకుండా, పరిశ్రమల నుంచి మురుగునీరు వదలకుండా అందరూ సహకరించాలని కోరారు. చెరువులు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తు చేశారు.

నాగిరెడ్డిని కలిసిన బట్టేపాటి



ఇందుకూరుపేట: వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీఎస్ నాగిరెడ్డిని అధికార ప్రతినిధి బట్టేపాటి నరేంద్రరెడ్డి మంగళవారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. పంటలకు గిట్టుబాటు ధర అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని నేతలు అన్నారు. రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందన్నారు. త్వరలో నెల్లూరులో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించి రైతులకు భరోసా ఇస్తామన్నారు. ఆయన వెంట మైనార్టీ నాయకుడు షబ్బీర్ ఉన్నారు.

కొవ్వొత్తులతో ర్యాలీ



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ఉగ్రదాడిని ఖండిస్తూ నగర పంచాయతీ పరిధిలోని బస్టాండ్ సెంటర్‌లో మంగళవారం ఉలామా కమిటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. పర్యాటకులపై కాల్పులు జరిపిన వారిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సభ్యులు అబ్దుల్ హమీద్, అహ్మద్‌బాషా, అబూబకర్ తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా బెల్టుషాపులు



విడవలూరులో షాపు పక్కనే మద్యం తాగుతూ..



ఇటీవల ఊటుకూరు షాపు నుంచి ఆటోలో మద్యం తరలిస్తున్న దృశ్యం



కూటమి ప్రభుత్వంలో మద్యం ఏరులై పారుతోంది. నాడు ఎక్కడో ఊరి శివారుల్లో ఉన్న దుకాణాలు నేడు మధ్యలోకి వచ్చేశాయి. ఇంకా ఊరూరా.. వీధివీధినా బెల్టు దుకాణాలు ఏర్పాటు చేసి అమ్మకాలు చేస్తున్నారు. మందుబాబులు తాగి తూగుతూ ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా షాపుల పక్కనే కూర్చోబెట్టి మద్యం తాగిస్తున్నారు. క్వార్టర్ బాటిల్‌పై అదనంగా వసూలు చేస్తున్న పరిస్థితులున్నాయి.

- నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణాల నిర్వహణ
- పల్లెల్లో ఏరులై పారుతున్న మద్యం
- షాపు పక్కనే పర్మిట్ రూమ్‌లు పెట్టి తాగిస్తున్న వైనం
- క్వార్టర్ బాటిల్‌పై రూ.20 అదనం

విడవలూరు: కూటమి ప్రభుత్వంలో ప్రధాన షాపుల నుంచి బెల్టు షాపుల వరకు సమయంతో సంబంధం లేకుండా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. కొన్నిచోట్ల తెల్లవారుజాము నుంచే షాపులను తెరిచి విక్రయిస్తున్నారు. వైన్ షాపు పక్కనే ప్రత్యేక రూమ్‌లను ఏర్పాటు చేసి మందుబాబులకు వసతులు కల్పించి తాగిస్తున్న పరిస్థితులున్నాయి. దీంతో మహిళలు ఆవేదన చెందుతున్నారు. మండలంలోని వావిళ్ల సెంటర్ నుంచి రామతీర్థం, దంపూరు, విడవలూరు, నెల్లూరుకు నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. కూటమి ప్రభుత్వంలో ఆ సెంటర్‌లో మద్యం షాపు ఏర్పాటు చేశారు. ప్రయాణికులతోపాటు అటు స్కూల్ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ సమస్యలు ఎక్కువయ్యాయని గ్రామస్తులు పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. గ్రామంలో గతంలో సీసీ రోడ్ల ప్రారంభోత్సవం సందర్భంగా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని కలిసి వావిళ్ల సెంటర్‌లో ఉన్న షాపును తొలగించి ఊరికి దూరంగా ఏర్పాటు చేయాలని మహిళలు విన్నవించారు. అండగా ఉంటానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే ఆ సమస్యకు పరిష్కారం చూపకపోవడంతో మహిళలు మండిపడుతున్నారు.

ఇష్టారాజ్యంగా..

మద్యం షాపుల్లో క్వార్టర్ బాటిల్‌పై రూ.20 అదనంగా వసూలు చేస్తున్నారు. ఎమ్మార్పీ కంటే అధికంగా ఎందుకు తీసుకుంటున్నారని ఎవరైనా ప్రశ్నించినా ఉపయోగం లేకుండా పోతోంది. కొందరు షాపు నష్టాల్లో ఉందని చెబుతుండగా, మరికొందరు ఇష్టమైతే కొను, లేకుంటే ఎవరికి చెప్పుకొంటావో చెప్పుకో అని సమాధానమిస్తున్నారు.

ఆటోల్లో తరలిస్తూ..

పగలు, రాత్రి తేడా లేకుండా విచ్చలవిడిగా పల్లెలకు ఆటోల్లో మద్యాన్ని తరలిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామాల్లో బెల్టుషాపులు లేకుండా కట్టడి చేస్తే.. కూటమి ప్రభుత్వంలో వీధికొకటి ఏర్పడింది. ఇప్పుడు మద్యం షాపుల కంటే.. బెల్టు షాపుల్లోనే బహిరంగంగా విక్రయాలు చేస్తున్నారంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. కొద్దిరోజుల క్రితం మండలంలోని ఊటుకూరు మద్యం దుకాణం నుంచి పట్టపగలే ఆటోలో సరుకు లోడ్ చేసుకుని పెద్దపాళెం వైపు వెళ్లడం చూసిన జనం ఇదేం బరితెగింపు అంటూ మాట్లాడుకున్నారు.

తాగునీరందడం లేదని ఆవేదన

ఇందుకూరుపేట: మండలంలోని గంగపట్నం, కాలువమూల కండ్రిగ రోడ్డు పక్కనున్న రొయ్యల ప్రాసెసింగ్ ప్లాంట్‌కు, అలాగే సమీపంలో ఉన్న పదేకరాల మునుగుతోటకు నీరు వాడేస్తున్నారని రాముడుపాళెం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. ముదివర్తిపాళెం నుంచి రాముడుపాళేనికి తాగునీటి పైపులైన్ ఉందన్నారు. వీటి నుంచి అక్రమంగా నీటిని వినియోగిస్తున్నారన్నారు. దీంతో తాగునీరందక ఇబ్బంది పడుతున్నట్లు వాపోయారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

గ్రావెల్ తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులు

వెంకటాచలం: మండలంలోని కందలపాడు తిప్పపై గ్రావెల్ తవ్వకాలను గ్రామస్తులు మంగళవారం అడ్డుకున్నారు. తిప్పపై గ్రావెల్ తవ్వకాలు చేపట్టేందుకు అనుమతులు పొందిన నిర్వాహకులు కొన్ని రోజుల నుంచి తవ్వే ప్రయత్నాలు చేస్తుండగా గ్రామస్తులు అడ్డుకుంటున్నారు. తమకు అన్నీ అనుమతులు ఉన్నాయని, పర్యావరణ అనుమతులు కూడా వచ్చాయని నిర్వాహకులు మంగళవారం గ్రామానికి వెళ్లి గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామంలోని అన్ని కుటుంబాలకు జీవనోపాధి కల్పిస్తున్న తిప్పను తవ్వేందుకు తాము ఒప్పుకోమని తెగేసి చెప్పడంతో వెనక్కి వచ్చేశారు.

నిమ్మకు నాణ్యత దెబ్బ



మార్కెట్‌కు వచ్చిన నిమ్మకాయలు

పొదలకూరు: నిమ్మ మార్కెట్‌ను నాణ్యత దెబ్బతీస్తోంది. కాయల దిగుబడి అంతంత మాత్రంగా ఉన్నప్పటికీ ధరలు అధికంగా ఉన్నాయి. అయితే నాణ్యత లేని కాయల వల్ల ధరలు తగ్గుముఖం పడుతున్నట్లు వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో కిలో కాయలు రూ.65 నుంచి రూ.95 వరకు ధర ఉంది. అయితే నాణ్యత లేని కారణంగా రూ.65లకే కొనుగోలు చేస్తున్నారు. దిగుబడి ఒక మోస్తరుగా ఉండడంతో ధరలు తగ్గుముఖం పడతాయనే ఆందోళనతో పిందెలను మార్కెట్‌కు తీసుకు వస్తున్నారు. దీంతో ఢిల్లీ మార్కెట్‌కు కాయలను పంపాలంటే ఇబ్బందిగా మారుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లే సమయానికి కాయలు ఎండుముఖం పట్టడంతో ధరలు తగ్గిపోతున్నాయని చెప్పారు.

బాల్య వివాహాలను నివారించాలి



మనుబోలు: బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



ఇందుకూరుపేటలో..

మనుబోలు: బాల్య వివాహాలను సమష్టిగా కృషి చేసి నివారించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ పిలుపునిచ్చారు. స్థానిక వెలుగు కార్యాలయంలో పొదుపు మహిళలకు మంగళవారం బాల్య వివాహాలతో తలెత్తే అనర్థాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. బాలికలకు 18 ఏళ్ల కన్నా ముందే వివాహం చేస్తే శారీరక సామర్థ్యం తక్కువగా ఉండడంతోపాటు చిన్న వయస్సులో గర్భం ధరించడం వల్ల ఎన్నో అనారోగ్య సమ్యలు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. బాల్య వివాహాలు చేయడం నేరమని, జైలు శిక్ష ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం వనజాక్షి, సీసీలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

- ఇందుకూరుపేట: మండలంలోని ఇందుకూరుపేట సంఘమిత్ర కార్యాలయంలో మంగళవారం బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సఖి వన్‌స్టాఫ్ సెంటర్ ప్రతినిధి ఎన్.ప్రశాంతి, ఐసీపీఎస్ ప్రతినిధి సుమ, సీడీపీఓ రాజ్యలక్ష్మి, ఏపీఎం సరిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుబ్బరత్మ, ముంజుల, శిరీష తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌ఓల నిరసన

నెల్లూరు(అర్బన్): సమస్యలు పరిష్కరించాలంటూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు సీహెచ్‌ఓలు మంగళవారం స్థానిక సంతపేటలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు భానుమహేష్ మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా తమకు 23 శాతం వేతన సవరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న తమకు ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు మినహాయింపు ఇవ్వాలని కోరారు. రెగ్యులర్ చేయాలన్నారు. ఆయుష్మాన్ భారత్ మందిరాల అద్దెను చెల్లించాలని కోరారు. ఇన్సెంటివ్స్‌ను తక్షణమే విడుదల చేయాలని కోరారు. మెటీరియల్ రవాణా చార్జీలు చెల్లించాలన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

విద్యార్థులకు సూచనలిస్తున్న ప్రభాకర్‌రెడ్డి



కొడవలూరులో విద్యార్థులు గీసిన బొమ్మల ప్రదర్శన



కోవూరు: విద్యార్థులు సెలవుల్లో గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని రిటైర్డ్ టీచర్ కట్టా ప్రభాకర్‌రెడ్డి సూచించారు. కొడవలూరు మండలంలోని యల్లాయపాళెం శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులతో మంగళవారం కథలు చెప్పించడం, రాయించడం, పాటలు పాడించడం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైబ్రరీలకు రావడం వల్ల సెలవులను ఆనందదాయకంగా గడపడంతోపాటు ఎంతో ప్రయోజనం ఉంటుందని చెప్పారు. లైబ్రేరియన్ జె.సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు కేతు వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

- శిబిరంలో భాగంగా కొడవలూరులోని గ్రంథాలయంలో విద్యార్థులతో మంగళవారం చిత్రాలు వేయించారు. మహనీయుల జీవితచరిత్రలను చదివించారు. రిటైర్డ్ హెచ్‌ఎం వెంకయ్య మాట్లాడారు. లైబ్రేరియన్ కె.రాజేశ్వరి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

యోగాలో బంగారు పతకం



పతకం అందుకుంటున్న కావ్యశ్రీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా యోగాసన భారతి సంయుక్తంగా నిర్వహించిన రెండో ఆసియా ఇంటర్నేషనల్ యోగా స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌లో నెల్లూరుకు చెందిన యోగా క్రీడాకారిణి గుంజి కావ్యశ్రీ బంగారు పతకాన్ని సాధించింది. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఈ అంతర్జాతీయ పోటీల్లో 21 దేశాల క్రీడాకారులు పాల్గొన్నారు. నెల్లూరు వాసి ప్రథమ స్థానం సాధించడంపై పలువురు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు.

కుట్టులో మహిళలకు శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగమణి

తోటపల్లిగూడూరు: బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా పేద మహిళలకు కుట్టులో శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని ముత్తుకూరు–3 సచివాలయంలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నాగమణి మాట్లాడుతూ 90 రోజుల పాటు మహిళలు శిక్షణ పొంది స్వయం ఉపాధిని పెంపొందించుకోవచ్చని చెప్పారు. మొదటి విడతగా 70 మంది ఈ శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు. త్వరలో రెండో విడత శిక్షణ ప్రారంభమవుతుందని ఎంపీడీఓ తెలిపారు.

అక్షరలో ఎన్‌సీసీ శిక్షణ శిబిరం



మాట్లాడుతున్న ఎన్‌సీసీ అధికారులు

వెంకటాచలం: 10 ఆంధ్ర నావల్ యూనిట్ ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ ఆధ్వర్యంలో మండలంలోని సరస్వతీనగర్‌లో ఉన్న అక్షర విద్యాలయంలో వార్షిక శిక్షణ శిబిరం మంగళవారం నిర్వహించారు. గణేష్ మాట్లాడుతూ మే 7వ తేదీ వరకు ఈ శిబిరం జరుగుతుందని, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, జాతీయ సమైక్యత, సామాజిక సేవ, దేశభక్తి, గన్ ఫైరింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు గుండాల నరేంద్రబాబు, మల్లికార్జునరెడ్డి, మస్తానయ్య, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎడగారు సాగుకు సన్నద్ధం

సోమశిల జలాశయంలో సాగునీరు పుష్కలంగా ఉండడంతో వెంకటాచలం మండలంలో రైతులు రెండో పంట ఎడగారు సాగుకు సిద్ధమయ్యారు. కొన్ని గ్రామాల్లో దుక్కి పనులు సాగుతుండగా, కొన్ని గ్రామాల్లో వరినాట్లు వేసేందుకు కయ్యలు సిద్ధం చేశారు. రబీలో సుమారు 50 వేల ఎకరాలు సాగు చేయగా, ఖరీఫ్‌లో 20 ఎకరాల్లోనే సాగు చేపట్టనున్నారు.

- వెంకటాచలంలో 20 వేల ఎకరాల్లో రెండో పంట
- నారుమళ్లు సిద్ధం చేస్తున్న రైతులు



గొలగమూడిలో పొలంలో నీరు నింపిన రైతులు



సర్వేపల్లి కాలువ ద్వారా రిజర్వాయర్‌కు నీరు విడుదల

వెంకటాచలం: మండలంలో సర్వేపల్లి రిజర్వాయర్, కనుపూరు కాలువ కింద 50 వేల ఎకరాలకు పైగా తొలి పంట సాగు చేసుకున్న రైతులకు దిగుబడులు తగ్గిపోవడం, మద్దతు ధర లభించకపోవడం నిరాశకు గురయ్యారు. సోమశిల జలాశయంతోపాటు, సర్వేపల్లి రిజర్వాయర్‌లో పుష్కలంగా నీరు ఉండడంతో రెండో పంటకు సాగు నీరిచ్చేందుకు అధికారులు ఆదేశాలిచ్చారు. మండలంలో సర్వేపల్లి రిజర్వాయర్, కనుపూరు కెనాల్ కింద సుమారు 20 వేల ఎకరాల్లో వరిసాగు చేపట్టే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. మండలంలో ఇస్కపాళెం, సర్వేపల్లి, అనికేపల్లి, నిడిగుంటపాళెం, పూడిపర్తి, గొలగమూడి, కనుపూరు, తిక్కవరప్పాడు, కంటేపల్లి, కురిచెర్లపాడు తదితర గ్రామాల్లో రైతులు రెండో పంట సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఆయా గ్రామాల్లోని చెరువులకు సాగునీరు నింపాలని ఇరిగేషన్ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. దీంతో రైతులు పొలాల్లో ముమ్మరంగా దుక్కి పనుల్లో నిమగ్నమయ్యారు. నారుమళ్లు సిద్ధం చేసుకుని, సాగు నీరు కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. తొలి పంటలో ఆశించిన లాభాలు పొందలేకపోయిన రైతులు రెండో పంట సాగు ద్వారానైనా కనీసం గట్టెక్కాలని తపనపడుతున్నారు.

ఎరువుల కొరతపై ఆందోళన

అయితే పంట సాగుకు యూరియా, డీఏపీ తదితర ఎరువుల కొరతపై రైతులు ఆందోళన చెందుతున్నారు. తొలి పంట సాగు సమయంలో యూరియా, డీఏపీ అవసరమైనంత మేరకు లేకపోవడంతో రైతులు బ్లాక్ మార్కెట్‌లో ఎక్కువ ధరకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. రూ.268 ఎమ్మార్పీ ధర కలిగిన యూరియాను రూ.300 నుంచి రూ.350 వరకు కొనుగోలు చేయాల్సి వచ్చింది. డీఏపీ అవసరమైన సమయంలో లభించకపోవడంతో అధిక ధరలకు వెచ్చించి ఇతర ఎరువులు కొనుగోలు చేయాల్సి వచ్చిందని రైతులు చెబుతున్నారు.

10వ తేదీలోగా నారుమళ్లు పోసుకోవాలి

“వెంకటాచలం మండలంలో రెండో పంట సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్న రైతులు మే 10వ తేదీలోగా నారుమళ్లు పోసుకోవాలి. మద్దతు ధర, దిగుబడులు కోసం కేఎస్‌ఎం 1638, 733 రకం వరిసాగు చేపట్టేందుకు రైతులు ఆసక్తి చూపాలి. ఎరువుల సమస్య తలెత్తకుండా చర్యలు చేపడతాం.

– హరికరుణాకర్‌రెడ్డి, ఏఓ

కేఎస్‌ఎం రకాలైతే మేలు

రెండో పంట సాగుకు సాగునీరు విడుదల చేస్తుండడంతో మండలంలోని సగంపైగా గ్రామాల్లో వరిసాగు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. మండలంలో తొలి పంటలో ఎక్కువ మంది రైతులు బీపీటీ రకం సాగు చేపట్టారు. అయితే మద్దతు ధర లేకపోవడంతో రైతులు తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయశాఖ అధికారులు రెండో పంటకు ఏ రకం వరిసాగు చేపట్టాలో రైతులకు వివరిస్తున్నారు. రెండో పంటకు ఆర్‌ఎన్‌ఆర్ (షుగర్ లెస్) దిగుబడులు పెద్దగా వచ్చే అవకాశం ఉండకపోవడంతో కేఎస్‌ఎం 1638, 733 రకం వరిసాగు చేపట్టాలని రైతులకు సూచిస్తున్నారు. మే 10వ తేదీలోగా నారుమళ్లు పోసుకుంటే దిగుబడులు బాగా వచ్చే అవకాశం ఉందని చెబుతుండడంతో రైతులు మే 5వ తేదీ నుంచే నార్లు పోసేందుకు సమాయత్తం అవుతున్నారు.

విజ్ఞాన శిబిరంతో మానసికోల్లాసం



శిబిరంలో మాట్లాడుతున్న విద్యార్థిని

మనుబోలు: వేసవి విజ్ఞాన శిబిరాలతో విద్యార్థులకు మానసికోల్లాసం కలుగుతుందని మనుబోలు లైబ్రేరియన్ అరుణ్‌కుమార్ అన్నారు. మనుబోలు గ్రంథాలయం ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు కథల పుస్తకాలను చదివించారు. తర్వాత వారు చదివిన కథల్లోని నీతిని వారితోనే చెప్పించారు. ఇటీవల వెలువడిన 10వ తరగతి ఫలితాల్లో మండలంలో మొదటి ర్యాంకు సాధించిన మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని మౌనిక తన అనుభవాలను చిన్నారులతో పంచుకున్నారు. మొదటి ఈ సందర్భంగా లైబ్రేరియన్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ శిబిరాన్ని చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీఎం పర్యటనను అడ్డుకుంటాం

నెల్లూరు రూరల్: ‘ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చలేదు. సీఎం చంద్రబాబు ఆత్మకూరు పర్యటనను అడ్డుకుంటాం’ అని ఆర్‌పీఐ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే మాబు తెలిపారు. మంగళవారం ఆయన నెల్లూరులో మాట్లాడుతూ హామీలు అమలు చేయకుండా పర్యటనల పేరుతో ప్రజల్లో తిరగడానికి ముఖం ఎలా చెల్లుతుందని ప్రశ్నించారు. కూటమి పెద్దలు సంక్షేమాన్ని గాలికొదిలి సహజ వనరులను దోచుకోవడంలో నిమగ్నమయ్యారన్నారు.